ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



యోగాతో ఆరోగ్యం

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : యోగాసనాలు ఆచరించ డంతో మానసికంగా, శారీరకంగా దృడంగా ఉంటామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కెజిబి పాఠశాలలో యోగా గురు పతంజిలి శ్రీనివాస్ నిర్వహించిన యోగా శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు ముందుగా నిర్వహిస్తామన్నారు. యోగాతో ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న కలెక్టర్

ఉత్సాహంగా.. ఉత్తేజంగా..

- పాడేరులో సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ ప్రారంభం
- పట్టణంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ఆకట్టుకున్న థింసా, ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు
- చైతన్యపరిచిన నాయకుల ప్రసంగాలు
- గిరిజన సమగ్ర ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక ప్రకటించాలి : వి.శ్రీనివాసరావు డిమాండ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న కె.లోకనాథం, వేదికపై వి.శ్రీనివాసరావు, సురేంద్ర, అప్పలనర్స తదితరులు



పాడేరులో భారీ ర్యాలీలో పాల్గొన్న సిపిఎం కార్యకర్తలు, ఆదివాసీలు

ప్రజాశక్తి - పాడేరు, పాడేరు టౌన్ విలేకరులు

సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ మహాసభ బుధవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరుగనున్న ఈ మహాసభకు జిల్లా కేంద్రం పాడేరు ఆతిథ్యమిస్తోంది. ఈ నేపథ్యంలో పాడేరు పట్టణంలోని తలారిసింగి జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, ఐటిడిఎ మీదుగా పాత బస్టాండ్ వరకు సిపిఎం కార్యకర్తలు, ఆదివాసీలతో తొలి రోజు భారీ ర్యాలీ సాగింది. మహిళల థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరిజన వాయిద్యాలతో ఆదివాసీలు సందడి చేశారు. ఎర్రజెండాలను చేబూని సమరోత్సాహంతో వారంతా కదిలారు. సిపిఎం జిందాబాద్ నినాదాలతో పాడేరు పట్టణం మార్మోగింది.

అనంతరం పాడేరు పాత బస్టాండ్ ఆవరణలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో ఆదివాసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను ప్రకటించాలని, అదానీతో చేసుకున్న హైడ్రో ప్రాజెక్టుల ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా సమగ్ర ప్రగతి కోసం, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం, ఆదివాసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం, ఆదివాసీ చట్టాల పరిరక్షణ కోసం రానున్న కాలంలో సిపిఎం పోరాటం సాగిస్తుందని తెలిపారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పివిటిజిలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వారి పథకాలను తెగ్గోసిందన్నారు. పెన్షన్లు సక్రమంగా అందడం లేదని తెలిపారు. ఉపాధి హామీ కూలీల వేతనాలను, పని దినాలను పెంచాలని, కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ వ్యతిరేకి బిజెపి : కె.లోకనాథం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసీల వ్యతిరేకి అని అన్నారు. 11 ఏళ్ల నుంచి ఆదివాసీలపై బిజెపి యుద్ధం చేస్తోందని. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్‌కు భిన్నంగా మార్పులు చేస్తోందని విమర్శించారు. ఎన్నో అభివృద్ధి పథకాలను ఆదివాసీలకు దూరం చేసిందని మండిపడ్డారు. ఆదివాసీలకు అన్యాయం చేస్తే సిపిఎం ఊరుకోదన్నారు. గిరిజనులు పండించే కాఫీకి, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని ఉత్పత్తులను జిసిసి ద్వారా కొనుగోలు చేయాలన్నారు. చింతపల్లి, అరకు ప్రాంతాల్లో ఆర్టీసీ డిపోలు ఏర్పాటు చేయాలని, అన్ని ప్రాంతాలకు బస్ సౌకర్యం కల్పించాలని కోరారు.

గిరిజన రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి : కిల్లో సురేంద్ర

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీలోని కాఫీ రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. గిరిజన రైతులు పండిస్తున్న కాఫీకి, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కాఫీ రైతులకు ఇవ్వాల్సిన రూ.60 కోట్ల బకాయిలను చెల్లించాలన్నారు. 1/70 చట్టంతో పాటు గిరిజన చట్టాలన్నింటినీ పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మహత్తర ఉద్యమానికి మహాసభ వేదిక : అప్పలనర్స

పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో ఆదివాసీల సమస్యల పరిష్కారానికి, జిల్లా సమగ్రాభివృద్ధి కోసం చేపట్టనున్న మహత్తర ఉద్యమానికి సిపిఎం ప్రథమ మహాసభ వేదిక కాబోతోందని అన్నారు. శాసనసభ, లోక్‌సభల్లో ఆదివాసీల ఊసే ఉండటం లేదని తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. ఆదివాసీల అభివృద్ధికి కేటాయించవలసిన నిధులు మంజూరు కావడం లేదని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ.8 వేల కోట్లు కేటాయించవలసి ఉండగా, రెండు వేల కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఆదివాసీలంతా ఐక్య పోరాటాలకు కదిలిరావాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ ఏజెన్సీలోని నాన్ షెడ్యూల్ ఏరియాలో ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతాల్లో చేర్చి ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, ఎస్.హైమావతి, నాయకులు తిరుపతిరావు, వి.జయ, సుందరరావు, లక్కు తదితరులు పాల్గొన్నారు.



థింసా నృత్యంతో ఆకట్టుకున్న గిరి మహిళలు



నివేదికపై చర్చలు జరుపుతున్న ప్రతినిధులు



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

కాఫీ హౌస్‌లో ప్రతినిధుల సభ ప్రారంభం

బహిరంగ సభ అనంతరం స్థానిక కాఫీ హౌస్ హాల్‌లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. సీతారాం ఏచూరి ప్రాంగణంగా దీనికి నామకరణం చేశారు. డి.గంగరాజు, పి.లక్కు, హైమావతి, ఎ.బుజ్జిబాబు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 200 మంది ప్రతినిధులుగా హాజరయ్యారు. ప్రతినిధుల సభ ప్రారంభంలో ఇటీవల మృతిచెందిన పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. సంతాప తీర్మానాన్ని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు ప్రవేశపెట్టారు. కార్యదర్శి నివేదికను పి.అప్పలనర్స ప్రవేశపెట్టారు. అనంతరం నివేదికపై ప్రతినిధులంతా చర్చలు జరిపారు. జిల్లాకు సంబంధించి పలు కీలక అంశాలపై ఈ మహాసభలో తీర్మానాలు చేయనున్నారు. గడిచిన కాలంలో జరిగిన పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించనున్నారు. మోడీ ప్రభుత్వం గిరిజన చట్టాలు, హక్కులపై దాడిని తీవ్రం చేస్తున్న క్రమంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో తలపెట్టిన సిపిఎం ప్రథమ మహాసభ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. తొలి రోజు జరిగిన భారీ ర్యాలీ, బహిరంగ సభ, అందులో నాయకులు చేసిన ప్రసంగాలు ప్రజలను చైతన్యపరిచాయి.



ప్రసవ అనంతరం తల్లీబిడ్డను పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ హిమబిందు

వైద్యాధికారి చొరవతో ఆసుపత్రిలో ప్రసవం

- గిరిజన గ్రామానికి వెళ్లి ఒప్పించి తీసుకొచ్చిన డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి-సీలేరు

దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డికె.హిమబిందు చొరవతో ఇద్దరు గర్భిణులను ఆసుపత్రికి తరలించి సుఖ ప్రసవం చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.... గూడెం కొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ దొరగొంది గ్రామానికి చెందిన గర్భిణులు గుంట సంధ్య, గుంట తిలయికు ప్రసవ సమయం సమీపించడంతో ఆసుపత్రికి వెళ్లాలని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సూచించారు. వారిని ఆసుపత్రికి తరలించేందుకు వైద్య సిబ్బంది సోమవారం నుంచి ప్రయత్నిస్తున్నప్పటికీ గర్భిణులు నిరాకరించారు. విషయం తెలుసుకున్న దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు బుధవారం గ్రామానికి వెళ్లారు. శనగనూరు వరకు వాహనంలోనూ, అక్కడ నుంచి 5 కిలోమీటర్లు కాలినడకన గ్రామానికి వెళ్లారు. అప్పటికే పురిటి నొప్పులు ప్రారంభమైన గర్భిణులకు, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేసి వారు ఆసుపత్రికి వచ్చేందుకు ఒప్పించారు. ఇద్దరు గర్భిణులను కొంత దూరం వరకు ద్విచక్ర వాహనంలో తీసుకొని వచ్చి అక్కడ నుంచి అంబులెన్స్‌లో ఆసుపత్రికి చేర్చారు. సాయంత్రానికి ఇద్దరికీ వైద్యాధికారి ఆసుపత్రిలో సుఖ ప్రసవం చేశారు. ఇద్దరు గర్భిణులు పండంటి మగ బిడ్డలకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ హిమబిందు విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రసవం పొందిన తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. గ్రామాల్లో గర్భిణులు ప్రసవ సమయానికి 10 రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. తమ ఇళ్ల ప్రసవం పొందితే తల్లీ బిడ్డ ఆరోగ్యానికి క్షేమం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లోవ కుమారి, పారా మెడికల్ ఉద్యోగులు మత్స్యకొండ, సీత, రాజేశ్వరి, బాలకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓమిక్యాంప్ ద్వారా జిఎన్ఎమ్, బిఎస్ఆర్ నర్సింగ్ చేసిన నిరుద్యోగ యువతీ యువకులకు జర్మనీ భాష నేర్పించి జర్మనీ దేశంలో ఉద్యోగులు కల్పించడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.రోహిణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి 35 సంవత్సరాలు లోపు వయసుగల వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల పని అనుభవంతో పాటు జర్మనీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఆరు నెలల పాటు గుంటూరులో శిక్షణ ఉంటుందని, జర్మనీ భాషలో (ఏ వన్, ఏ టు) (బి వన్ బి టు) స్థాయిలు తీర్చిదిద్ది ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ. 2.33 లక్షల నుండి రూ.3.26 లక్షల ఉంటుందని, ఆసక్తికలిగిన అభ్యర్థులు హెల్ప్ లైన్ నెంబర్ 9988853335కు సంప్రదించవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నికలు ఈ నెల 5న గురువారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్, శాసనమండలి ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కెఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. ఎన్నికల ఏర్పాట్లును బుధవారం పర్యవేక్షించిన సబ్ కలెక్టర్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాల్లో మొత్తం 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వై.రామవరం మండలంలోని ఎగువ ప్రాంతంలో ఒక పోలింగ్ కేంద్రం, మండల కేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రం, మిగిలిన అన్ని మండలాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో పురుష ఓటర్లు 388 మంది, మహిళా ఓటర్లు 249 మంది, మొత్తం 637 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఈ ఎన్నికలు నిర్వహణ కొరకు 15 మంది పిఓలు, 15 మంది ఎపీఓలు, 45 మంది ఓపిఓలు, 14 మంది మైక్రో అబ్జర్వర్లు, ఏడుగురు సెక్టార్ అధికారులు, ఏడుగురు రూటు అధికారులు, 11 బొలెరో వాహనాలు, ఏడు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారంఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం కేంద్రాల బాక్సులను రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ చేర్చి, అనంతరం కాకినాడ జేఎన్టీయూ కళాశాలకు ప్రతిష్టమైన భద్రత వలయంలో బాక్సులు తరలించడం జరుగుతుందని వెల్లడించారు. చింతూరు డివిజన్‌కు సంబంధించిన ఎన్నికల ఏర్పాట్లు చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం తహశీల్దారు రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్లు ఎన్‌వివి.సత్యనారాయణ, శివ, సరిత, తేజస్విని, బాషా, త్రిమూర్తులు, సుధాకర్‌రావు, బాలాజీ, ఎన్నికల సెల్ మణికంఠ, అలెగ్జాండర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

పోలింగ్ కేంద్రం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం ఓటర్లు
ఎటపాక మండల తహశీల్దారు కార్యాలయం	6	4	10
కూనవరం జెడ్‌పి హైస్కూల్	20	21	41
చింతూరు జెడ్‌పి హైస్కూల్	21	16	37
విఆర్.పురం జెడ్‌పి హైస్కూల్	10	13	23
మారేడుమిల్లి జెడ్‌పి హైస్కూల్	20	17	37
వై.రామవరం ఎంపి ఎలిమెంటరీ స్కూల్	23	11	34
వై.రామవరం గ్రామ పంచాయతీ ఆఫీసు	1	2	3
అడ్డతీగల జెడ్‌పి హైస్కూల్	61	37	98
రాజవొమ్మంగి ఎంపి ప్రాథమిక పాఠశాల	75	46	121
గంగవరం ఆశ్రమ బాలికల అప్పర్ ప్రైమరీ స్కూల్	34	17	51
రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల	77	47	124
దేవిపట్టణం ఇందుకూరుపేట జెడ్‌పి హైస్కూల్	40	18	58

పలు పాఠశాలలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ బుధవారం మారేడుమిల్లి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఇందులో భాగంగా బంధ ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పరాక్ రాష్ట్రీయ సర్వేక్షన్ 3, 6, 9 తరగతులకు జరిగే పరీక్షలు కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం మారేడుమిల్లి మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి ఎపిఎఎఆర్, ఒఎస్‌సి, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సంబంధించిన ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల తరగతి గదిని పరిశీలిస్తున్న డిఇఒ బ్రహ్మాజీ



గ్రామసభలో మాట్లాడుతున్న పెద్ద ఆర్యూర్ గ్రామ సర్పంచ్ నాగమణి

నిర్వాసితులకు తక్షణమే పరిహారం ఇప్పించాలి

ఎమ్మెల్యే ముందు పోలవరం బాధితుల సమస్యలు ఏకరువు పెట్టిన సర్పంచ్

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం, ఆర్ఆర్ ప్యాకేజీ తక్షణమే ఇప్పించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి మండలంలోని పెద్దఆర్యూర్ పంచాయతీ సర్పంచ్ నాగమణి విజ్ఞప్తి చేశారు. పెద్దఆర్యూర్ గ్రామంలో బుధవారం జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే శిరీషా దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ స్థానిక సర్పంచ్ అయిన తనను గ్రామసభకు అధ్యక్షత వహించమని చెప్పకుండా రాజకీయ నాయకులే సభను మొదలు పెట్టడం సరికాదన్నారు. అయినా సరే తన గ్రామ పంచాయతీలోని సమస్యలను తెలియజేస్తున్నానని, వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే శిరీషాదేవిని కోరారు. 40 అడుగులు గోదావరి వరద నీటికే విద్యుత్ స్తంభాలు మునిగిపోతుండడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారని, దీని వల్ల పెద్దఆర్యూర్ గ్రామపంచాయతీతో పాటు మిగతా గిరిజన గ్రామాలు రోజులు తరబడి అంధకారంలో ఉండవలసి దుస్థితి ఉంటుందని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. ఈ ఏడాది రెండో సారి గోదావరి వరదలు వచ్చినప్పుడు మండలంలోని అన్ని గ్రామాలకు నిత్యవసర సరుకులు ఇచ్చారుగాని పెద్ద ఆర్యూర్ గ్రామపంచాయతీ ప్రజలకు ఇవ్వలేదని, రూ.10వేలు ఆర్థిక పరిహారం కూడా ప్రకటించలేదని పేర్కొన్నారు. దీనిపై అధికారుల వద్ద ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. పోలవరం బ్యాక్ వాటర్ వలన చిన్న వరదలకే మండలంలోని అన్ని గ్రామాలు మునిగిపోతున్నాయని, దీని వల్ల ప్రతి ఏటా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. వరదలకు మిర్చి నార్లు, వరి నార్లు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లిందని, తక్షణమే నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. గండి కొత్తగూడెం రోడ్డు కంకర రాళ్లు తేలిపోయి చాలా అధ్వానంగా ఉందని, బీటీ రోడ్డు మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ డి.అమ్మాజీ, మాజీ ఎంపిటిసి పాయం సత్యనారాయణ, గిరిజన సంఘం మండల నాయకులు బాబు బొర్రయ్య, తెల్లం తమ్మయ్య, పోడియం రామారావు, వార్డు మెంబర్లు స్థానికులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం రింతాడ పంచాయతీ దుచ్చెరపాలెం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త సాగిన లక్ష్మి అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందారు. ఆమె భర్త సాగిన శ్రీరాములు పదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటినుంచి లక్ష్మి ఆశ కార్యకర్తగా పని చేస్తూ తన ఇద్దరు కుమారులను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు దుర్గా ప్రశాంత్ ఇంజనీరింగ్ పూర్తి చేసి కర్ణాటక రాష్ట్రంలో ఎల్ఎన్‌టి కంపెనీలో ఉద్యోగానికి ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. రెండో కుమారుడు మహేంద్ర నర్సీపట్నం అవంతి కాలేజీలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. ఎంతో కష్టపడి చదివించిన తల్లి మృతి చెందడంతో ఇద్దరు కుమారులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



సాగిన లక్ష్మి (ఫైల్‌ఫొటో)

6న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -పాడేరు: ఈనెల 6 న శుక్రవారం ఉదయం 9 గంటలు నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని పలు మండలాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏబీఎన్ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ డుంబ్రిగుడ సబ్ స్టేషన్ మరమత్తులు నిమిత్తం డుంబ్రిగుడ మండలంలో అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. 33/11 కేవీ చింతపల్లి సబ్‌స్టేషన్లో 11కేవీ తాజంగి ఫీడర్ పరిధిలో తాజంగి, లంబసింగి జెర్రిలగెడ్డ, అంజలిశనివారం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. 33/11 కేవీ జి.మాడుగుల సబ్‌స్టేషన్లో సొలభం ఫీడర్ పరిధిలో సొలభం, పేదలోచలి, వంతల గడుతూరు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. కేవీ కిండంగి సబ్‌స్టేషన్లో 11 కేవీ వంట్లమామిడి ఫీడర్ పరిధిలో వంట్లమామిడి, ఐనాడ, మినిములూరు, దేవాపురం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అనంతగిరి సబ్‌స్టేషన్లో 11కేవీ ట్రైడ ఫీడర్ పరిధిలో కొండిబ, పైనంపాడు, లొంగపర్తి, గుమ్మా ,కివర్ల గ్రామాలకు, కోయ్యూరు మండలం లో కేవీ రాజన్నపాలెం ఫీడర్ పరిధిలో డౌనూరు, ధర్మవరం, మల్లవరం బచింత గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

వంతెనను పునర్నిర్మించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: హుదూద్ తుఫానుకు కొట్టుకు పోయిన శీలంగొంది రోడ్డు, వంతెనను వెంటనే పునర్నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశాడు. బుధవారం ఆయన స్థానిక విలేకరణతో మాట్లాడుతూ, హుదూద్ తుఫానుకు వంతెన కొట్టుకుపోయిందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు సుమారు ఏళ్లు గడుస్తున్నా పునార్నిర్మించడంలో అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీంతో ఈ ప్రాంత గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి వంతెనను నిర్మించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో అందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

- తహశీల్దార్ జయప్రకాష్

ప్రజాశక్తి హుకుంపేట:-మండలంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఈనెల6 తేదీ నుండి జనవరి 8వ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.జయ ప్రకాష్ బుధవారం తెలిపారు. తహసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలతో బాధపడుతున్న గిరిజనులకు సత్వర పరిష్కారం కోసం ఈ సదస్సును ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేయబడునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిటి సిహెచ్ కృష్ణారావు, వీఆర్వో పాల్గొన్నారు.

బియాండ్ ద క్లాస్ రూమ్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ఇటీవల నిర్వహించిన జాతీయ సదస్సు పరిశోధనా పత్రాల సంకలనం మూడవ సంచిక బియాండ్ ద క్లాస్ రూమ్‌ను ఏయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి శశిభూషణరావు మాట్లాడుతూ, నూతన విద్యా విధానంపై నిర్వహించిన జాతీయ సదస్సు అనేకమంది నిపుణులతో చర్చలు, విలువైన సూచనలకు మార్గం చూపిందన్నారు. ఈ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాలను ప్రత్యేక సంచికగా తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పుస్తక సంపాదకులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, ప్రత్యేక సంచిక సంపాదకులు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, డాక్టర్ ఎంవిఎస్ఎస్ ప్రకాష్‌రావు, డాక్టర్ ఎం.అబ్దుల్ జుల్ఫికర్ అలీ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణ రావు బుధవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వేడుకలను డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ- సి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆచార్య టి.షారోన్‌రాజు, అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్ల దీక్షలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంక్షేమ గురుకుల విద్యా రంగంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్లను రెగ్యులర్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాడేరు ఐటిడిఏ ఎదుట గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్లు 19 రోజులుగా నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. దీక్షలకు మద్దతు తెలిపారు. చాలా ఏళ్లుగా గురుకుల పాఠశాలల్లో ఉన్న ఖాళీ టీచర్ పోస్టుల్లో నియమించబడిన ఈ అవుట్ సోర్సింగ్ గిరిజన టీచర్లను మెగా డీఎస్సీ పేరుతో బయటకు పంపించే నిర్ణయం దుర్మార్గమన్నారు. ఇన్నేళ్లు తక్కువ వేతనాలతో ప్రభుత్వానికి సేవ చేశారని తెలిపారు. అవుట్సోర్సింగ్ పై పని చేస్తున్న ఈ టీచర్లను కాంటాక్ట్ గా గుర్తించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో అర్హులైన గిరిజనులు అవుట్సోర్సింగ్, కాంట్రాక్టు పై పని చేస్తుంటే గిరిజనేతరులు రెగ్యులర్ ప్రాతిపదికన పని చేస్తున్నారని, ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. అవుట్ సోర్సింగ్ టీచర్ల కడుపు కొడితే సహించబోమని హెచ్చరించారు. యువత జీవితాలతో చెలగాటమాడడం సరికాదని అధికారులు, మంత్రులు మంచి ఆలోచన చేసి అవుట్సోర్సింగ్ పై ఇన్నేళ్లుగా సేవలు అందిస్తున్న వీరందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ద్రోహం తలపెడితే ఎలాంటి ఉద్యమానికైనా సిద్ధం కావాలని ఔట్సోర్సింగ్ టీచర్లకు పిలుపునిచ్చారు. ఇందుకు పూర్తిగా తమ మద్దతు ఉంటుందని చెప్పారు. అవుట్సోర్సింగ్ టీచర్లు వారి సమస్యలపై వినతిపత్రం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు లోకనాథం, అప్పలనరస, కిల్లో సురేంద్ర పాల్గొన్నారు.

35 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



కాఫీ తోటలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- పెదబయలు:రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వ పథకాలు అందించి ప్రోత్సహిస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో కొత్తగా మరో 35 రైతు ఉత్పత్తిదారు సంఘాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. గలగండ పంచాయతీ సిరసపల్లి గ్రామం వద్ద చిరుధాన్యాలు సేకరణ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ప్రతి గిరిజన గ్రామంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. గిరిజన రైతుల అభివృద్ధికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సహకారం అందిస్తాయన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సహకారంతో రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు.కలెక్టరేట్ లో స్వచ్ఛంద సంస్థలతో జిల్లా లాభాపేక్ష లేని ఫోరం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ఫోరంలో 64 స్వచ్ఛంద సంస్థలు నమోదు చేసుకున్నాయని చెప్పారు. గిరిజన ఉత్పత్తులపై ఏర్పాటుచేసిన ఫోటో ప్రదర్శనను ఆయన తిలకించారు.

జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ .బి.ఎస్ నంద్ మాట్లాడుతూ, జిల్లాలో చిరుధాన్యాల సాగు పెరగాలన్నారు. చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని చెప్పారు. చిరుధాన్యాలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు.

సుసాగు చిరుధాన్య చెల్లెళ్ల సంఘం ఛైర్ పర్సన్ ఎం విజయ మాట్లాడుతూ, 250 మంది రైతులతో సంఘం ప్రారంభించచాని, ప్రస్తుతం 1130 మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో చిరుధాన్యాల సాగుపై చైతన్యవంతం చేస్తున్నామని చెప్పారు. అనంతరం కెవికె ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి ఏ. రమేష్ కుమార్‌రావు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం భాస్కరరావు, కాఫీ బోర్డు అధికారి సుదీప్, ఎంపీడీవో పూర్ణయ్య, తహసిల్దార్ రంగారావు, ఎంఈఓ పుష్ప జోసెఫ్, కెవికె శాస్త్రవేత్త రాజ్ కుమార్ ఎంపీపీ వరహాలమ్మ, సర్పంచ్ లోహిత థాస్, సంస్థ సీఈవో టి.శాంతి పాల్గొన్నారు.

రాయితీపై ఉపకరణాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యాన పంటల రైతులకు రాయితీపై వివిధ ఉపకరణాలు మంజూరు చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వ్యవసాయధికారి ఎ.రమేష్ కుమార్‌రావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.పండ్ల తోటల అభివృద్ధి విస్తరణ ద్వారా హెక్టారు మామిడి పంటకు రూ.7980, జీడిమామిడి పంటకు రూ. 12000 హెక్టారుకు, డ్రాగన్ ఫ్రూట్ రూ. 30000, అవకాడ్ రూ.18000 హెక్టారుకు, స్ట్రాబెర్రీ రూ.50000 హెక్టారుకు గరిష్ట రాయితీ ఉద్యానవనశాఖ ద్వారా మంజూరు చేస్తామన్నారు. పునరుద్ధరణ పథకం ద్వారా హెక్టారుకు జీడిమామిడి రూ. 10000 వరకు రాయితీ అందిస్తామని చెప్పారు. కూరగాయల విస్తరణ పథకము క్రింద హైబ్రీడ్ విత్తనముకు రూ.3000 హైబ్రీడ్ కూరగాయల సాగుకు రూ. 20000, పర్మినెంట్ పందిరులు చేసుకొనుటకు హెక్టారుకు రూ.2,50,000 రాయితీ ఇస్తామన్నారు. రక్షిత సాగు పథకము ద్వారా పాలి హౌస్ ప్లాస్టిక్ మల్చింగ్ హెక్టారుకు రూ.16000 రాయితీపై ఇస్తామన్నారు. సోలార్ కోల్డ్ రూమ్‌కు రూ. 9.515 లక్షలు గరిష్ట రాయితీ పొందవచ్చునని చెప్పారు. సమగ్ర నీటి యాజమాన్య పథకము క్రింద నీటి కూడలుకు గరిష్టంగా రూ.15000 రాయితీ, వి ం నీ ట్రాక్టరుకు రూ.75000, పవర్ టిల్లర్ కు రూ.60000 గరిష్ట రాయితీపై మంజూరు చేస్తామన్నారు. పూర్తి వివరాలకు సంప్రదించాలని చెప్పారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఒడ్డిమెట్ట జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన పిరుమల చంటి(75) టీవీఎస్ ఎక్స్ఎల్ బండి పై తుని వెళ్లి తిరిగి వస్తుండగా ఒడ్డుమెట్ట వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొనడంతో చంటి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రస్తుతం ఆయన అయ్యప్ప మాల దీక్షలో ఉన్నారు.. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ వెల్లడించారు.

40 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ఐటిఐ కాలనీలో జలగడుగల దుర్గ అనే మహిళ నుండి 40 లీటర్ల నాటుసారాను స్థానిక ఎక్సైజ్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకొని ఆమెను అరెస్టు చేశారు. అనంతరం ఆమెను కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్ విధించడంతో సెంట్రల్ జైలుకు తరలించారు. చోడవరం ఎక్సైజ్ సీఐ కె.వి.పాపు నాయుడు ఆధ్వర్యంలో ఎస్సై ఎం శేఖరం, కానిస్టేబుల్స్ రాధా, అప్పలనాయుడు, భీమ, రాము నాయుడుతో కలిసి ఐటిఐ కాలనీ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మహిళ నాటుసారాతో పట్టుబడింది.

మహిళపై హత్యాయత్నం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఒక మహిళపై హత్యాయత్నం చేసిన సంఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో ఒక ఆటోలో స్నేహితురాలితో కలిసి అంగన్‌వాడీ టీచర్ రహీమునిత బేగం ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వారి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం తలెత్తింది. రహీమునిత బేగం స్నేహితురాలు అగ్గిపుల్ల తీసి నిప్పంటించింది. దీంతో రహీమునిత బేగం చీరకు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. గాయాలపాలైన రహీమునిత బేగమ్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. రహీమునిత బేగం భర్త ఆదం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో డబ్బులు ఇవ్వలేదనే కోపంతో స్నేహితురాలు దాడికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. అగ్గిపెట్టెతో పాటు పెట్రోల్‌కూడా ఆమె తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో దాడిచేసిన మహిళపై హత్యాయత్నం కేసును నాలుగో పట్టణ పోలీసులు నమోదుచేశారు.

గంజాయి నిందితులకు పదేళ్ల జైలు

ప్రజాశక్తి-లీగల్ : గంజాయి కలిగి ఉండి, విక్రయించారనే అభియోగం రుజువైనందున ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం గంజాయి వంటి మత్తుమందుల కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం కం ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రభుత్వం తరపున వాదనను వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ జిఎస్ఎన్‌వి.ప్రసాదరావు కథనం ప్రకారం... గూడెం కొత్తవీధి మండలం, దారకొండ గ్రామానికి చెందిన కిల్లో జన్నీ, కిల్లో సీతా, కిల్లో కమల 2018 మార్చి 20వ తేదీన గూడెం కొత్త వీధి మండలంలో 50 కిలోల గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా నాకాబందీలో ఉన్న ఎక్సైజ్ గోల్కొండ సిఐ అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రాన్ని సంబంధిత కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పైవిధంగా బుధవారం తీర్పు వెల్లడించారు.

14న మైత్రి వాక్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం హ్యూమన్ జెనిటిక్స్ విభాగం, ఏక ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ నెల 14వ తేదీన మైత్రి వాక్ - 1.0ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ఆయన కార్యాలయంలో బుధవారం విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ఈ నెల 14వ తేదీన ఉదయం 7 గంటలకు ప్రారంభం అవుతుందని, ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనం నుంచి టిఎల్ఎన్ సభా హాల్ వరకు సాగుతుందని తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ అవగాహనా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వివరాలకు maitriwalk@gmail ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ జెనిటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి, ఆచార్య పి.పద్దయ్య, ఆచార్య డి.ఉదయ్‌కుమార్, ఆచార్య టి.మహంకాళి తదితరులు పాల్గొన్నారు.



తడిసిన చేనును చూపెడుతున్న రైతులు

వర్షాలకు తడిసిన వరి పంట

ప్రజాశక్తి - సీలేరు : మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు చేతికొచ్చిన వరిపంట తడిసి ముద్దయిందని గిరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ రాళ్లగెడ్డ రైతులు ఇటీవల వరి కోతలు కోసి పొలాల్లో ఆరబెట్టారు. మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు వరి పనలు పూర్తిగా తడిసిపోయి మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు. చేతికివచ్చిన పంట నాశనమయ్యే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు దెబ్బతిన్న ధాన్యం ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

సిసి రోడ్డు, భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలంలో సిసి రోడ్డు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులను బుధవారం జీకే వీధి ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని వంచల పంచాయతీ కోడసింగి గ్రామంలో రూ.3 లక్షలతో సిసి రోడ్డు, రూ.21.8 లక్షలతో రైతు సేవా కేంద్రం, రూ.17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. దామనాపల్లి పంచాయతీ పరిధిలో రూ.21.8 లక్షలతో రైతు సేవా కేంద్రం నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

టెర్రేసింగ్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 3.50 లక్షలతో టెర్రేసింగ్ పనులను బుధవారం జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పెద్ద గంగవరంలో సర్పంచి నడిగట్ల రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ జాబు కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరు ప్రభుత్వం కల్పిస్తున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ కార్డు లేని వారు ఎవరైనా ఉంటే సచివాలయం దరఖాస్తు చేసుకుంటే జాబ్ కార్డులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడి రామన్న, వార్డు సభ్యులు పాంగి పుల్లయ్య, వీఆర్పి బాకూరి లింగరాజు, గోవిందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-సీలేరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ వివాదాలు, ఇతర సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరిస్తామని జీకే వీధి మండల తహశీల్దారు టి.రామకృష్ణ వెల్లడించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 135 రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించినట్లు చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. వీఆర్వో అడంగల్, వన్ బి, ప్రభుత్వ భూముల రిజిస్టర్ లాంటి సమాచారాన్ని సదస్సుకు ముందే సిద్ధం చేసుకోవాలని సూచించారు. మండలంలో మొదటి దేవరపల్లి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు ప్రారంభిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరించి రసీదులిచ్చి వెంటనే భూ వివాదాలు పరిష్కారాలు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు సత్యనారాయణ, ఆర్ఐ మహాదేవ్, మండల సర్వే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనంతబాబు అక్రమ చేపల చెరువులపై..

విచారణ చేపట్టాలి

చర్యలు తీసుకోకుంటే ప్రజా తిరుగుబాటు తప్పదు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- రంపచోడవరం

అడ్డతీగల మండలంలో వైసిపి ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (అనంతబాబు) అక్రమ చెరువులపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రంపచోడవరం సిపిఎం కార్యాలయంలో బుధవారం జరిగిన రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల ప్రాంతీయ కమిటీ సమావేశంలో వెంటేశ్వర్లు మాట్లాడారు. ఏజెన్సీలో చేపలు చెరువులు తవ్వాలంటే అగ్రికల్చర్, ఫిషరీస్ డిపార్ట్మెంట్ అనుమతులు తప్పనిసరి అని జీవో నెంబర్ 7 చెబుతున్నప్పటికీ వాటిని పక్కనపెట్టి అనంతబాబుకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజలకు సాగు, తాగునీటికి ఉపయోగపడాల్సిన మద్దిగెడ్డ ప్రాజెక్టు నీటిని అనుమతుల్లేని చేపల చెరువులకు ఎలా ఇస్తున్నారన్నారు. వ్యవసాయానికి ఉపయోగపడని భూముల్లో మాత్రమే చేపల చెరువులు తవ్వాలని జీవోలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండా ఎందుకు చట్టాన్ని అధికారులు ఉల్లంఘిస్తున్నారని నిలదీశారు. అక్రమ చేపలు చెరువులకు అనుమతులిచ్చిన మత్స్యశాఖ, వ్యవసాయశాఖ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా చెరువులు తవ్విన అనంతబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. అనంతబాబు అక్రమలపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలు జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించాలని, లేకుంటే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం.వాణిశ్రీ, నాయకులు ఈతపల్లి సత్యనారాయణరెడ్డి, తీగల శ్రీను, రాజన్న దొర, వెంకటరెడ్డి, గంగిరెడ్డి, సంకురమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా మట్ల వాణిశ్రీ



స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆరుగురుతో ప్రాంతీయ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ మూడు మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా మట్ల వాణిశ్రీ, సభ్యులుగా తీగల శ్రీనివాస్, ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి, రాజన్న దొర, కత్తుల గంగిరెడ్డి, చామంతి ఎన్నికయ్యారు.

సిపిఎం చింతూరు మండల కార్యదర్శిగా పల్లపు వెంకట్



ప్రజాశక్తి-చింతూరు : భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) చింతూరు మండల నూతన కార్యదర్శిగా పల్లపు వెంకట్ ఎన్నికయ్యారు. మండలంలోని కల్లేరు గ్రామంలో బుధవారం జరిగిన పార్టీ మండల 9వ మహాసభలో మొత్తంగా 15 మందితో నూతన మండల కమిటీ ఎన్నికైంది. వెంకట్‌తో పాటుగా మరో నలుగురు సీసం సురేష్, మల్లం సుబ్బమ్మ, మోట్టుమ్ రాజయ్య, పోడియం లక్ష్మణ్ కార్యదర్శివర్గ సభ్యులుగా, ఎర్రంశెట్టి శ్రీనివాస్, మొర్రం రంగమ్మ, సవలం కన్నయ్య, వేక రాజ్ కుమార్, మడకం చిన్నయ్య, మడకం రమేష్, చింతా రాంబాబు, పట్రా రమేష్, కారం నాగేష్, కారం సుబ్బారావు మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మండల కార్యదర్శిగా ఎన్నికైన వెంకట్ విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం కార్మిక నాయకుడిగా జిల్లా స్థాయిలో పని చేస్తున్నారు.

6 నుండి విశాఖలో ట్రాన్స్‌పోర్ట్ అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్ ఆర్‌టిసి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుండి మూడు రోజుల పాటు ఆల్ ఇండియా పబ్లిక్ బస్ ట్రాన్స్ పోర్టు అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని ఎపిఎస్ ఆర్‌టిసి జోన్ వన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయ్ కుమార్ మీడియాకు బుధవారం తెలిపారు. కైలాసగిరి పోలీస్ మైదానంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ఎపి డిజిపి, ఆర్‌టిసి సిఎండి సిహెచ్‌డి తిరుమలరావు,తదితరులు పాల్గొంటారన్నారు. ఆఖరి రోజు ఆదివారం సాయంత్రం మూడు గంటలకు జరిగే ముగింపు ఉత్సవాల్లో రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖా మంత్రి ఎం.రామ ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

పోటీల నిర్వహణపై సమీక్ష

పోటీల నిర్వహణపై బుధవారం సాయంత్రం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు సంబంధిత అధికారులతో చర్చించారు. దేశంలో ఉన్న 20 ఆర్‌టిసి సంస్థల ఉద్యోగులు ఈ అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాల ఆర్‌టిసి సంస్థల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొంటారని, బుధవారం గుజరాత్ ఆర్‌టిసి నుండి 24 మంది వచ్చారని తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషా దేవి

విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి అన్నారు. మండలంలోని సీతపల్లి గురుకుల కళాశాలను, గురుకుల బాలికల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందరూ చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం డిగ్రీ, ఇంటర్ కళాశాల బాలికలు ఉంటున్న హాస్టళ్లను పరిశీలించి అక్కడ విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ప్రిన్సిపల్‌కు తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు సలాది బాపిరాజు పాల్గొన్నారు.

విశాఖ నుంచి పలు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - చెన్నయ్ ఎగ్మోర్ - విశాఖపట్నం, విశాఖపట్నం - షాలిమార్ - విశాఖపట్నం, సంబల్‌పూర్ - ఈరోడ్ - సంబల్పూర్, భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08557 విశాఖపట్నం - చెన్నయ్ ఎగ్మోర్ ప్రత్యేక రైలు 2024 డిసెంబర్ 7 నుంచి 2025 మార్చి 1 వరకు ప్రతి శనివారం రాత్రి 19.00 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు చెన్నయ్ ఎగ్మోర్ చేరుకుంటుంది. 08558 చెన్నయ్ ఎగ్మోర్ - విశాఖపట్నం ప్రత్యేక రైలు 2024 డిసెంబర్ 8 నుంచి 2025 మార్చి 2 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నయ్ ఎగ్మోర్ నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి 22.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08508 విశాఖపట్నం - షాలిమార్ ప్రత్యేక రైలు 2024 డిసెంబర్ 10 నుండి 2025 మార్చి 4 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11:20 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3:00 గంటలకు (బుధవారం) షాలిమార్ చేరుకుంటుంది. 08507 షాలిమార్ - విశాఖపట్నం ప్రత్యేక రైలు 2024 డిసెంబర్ 11 నుంచి 2025 మార్చి 5 వరకు ప్రతి బుధవారం ఉదయం 5:00 గంటలకు షాలిమార్ నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి 20:50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08311 సంబల్‌పూర్ - ఈరోడ్ ప్రత్యేక రైలు 2024 డిసెంబర్ 11 నుంచి 2025 మార్చి 5 వరకు ప్రతి బుధవారం ఉదయం 11:35 గంటలకు సంబల్‌పూర్ నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 21:30 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 21:32 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20.30 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. 08312 ఈరోడ్ - సంబల్‌పూర్ ప్రత్యేక రైలు 2024 డిసెంబర్ 13 నుంచి 2025 మార్చి 7 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 14:45 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13:08 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 13:10 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి శనివారం 23:15 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది.

02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు 2024 డిసెంబర్ 7 నుండి 2025 ఫిబ్రవరి 22 వరకు ప్రతి శనివారం 19:15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఆదివారం తెల్లవారుజామున 1:53 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 1:55 గంటలకు బయలుదేరి సోమవారం అర్ధరాత్రి 00.15 గంటలకు యశ్వంతపూర్ చేరుకుంటుంది. 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ ప్రత్యేక రైలు 2024 డిసెంబర్ 09 నుంచి 2025 ఫిబ్రవరి 24 వరకు ప్రతి సోమవారం ఉదయం 4:30 గంటలకు యశ్వంత్‌పూర్ నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4:30 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 04:32 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్‌కు వెళ్తుంది.